28న ఓటర్ల జాబితా విడుదల

- గ్రామీణ ఓటరు రూపకల్పనకు సహకరించాలి
- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 18 : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 13వ తేదీన ప్రచురించబడిన ముసాయిదా ఓటర్ జాబితాలపై ఈనెల 21వ తేదీ వరకు అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్నట్లయితే గ్రామ పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు సమర్పించవచ్చని జిల్లా ఎన్నికల అథారిటీ, కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. గ్రామీణ ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సంపూర్ణ సహకారం అందజేయాలని, ఓటరు జాబితా రూపకల్పనపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. బుధవారం ఆయన సమీకృత కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దేవ సహాయంతో కలిసి పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలకు రెండో సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా రూపకల్పనకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని, ఈ షెడ్యూల్ ప్రకారం ఈనెల 13వ తేదీన గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించామని తెలిపారు. జిల్లాలో మొత్తం 464 గ్రామ పంచాయతీల పరిధిలోని 4,138 వార్డుల్లో మొత్తం 6,45,459 ఓటర్లతో డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేశామన్నారు. అట్టి అభ్యంతరాలను పరిశీలించి ఈనెల 26వ తేదీలోగా పరిష్కరిస్తామని తెలిపారు. తుది ఫొటో ఎలెక్టోరల్ జాబితాను ఈనెల 28వ తేదీన ఆయా గ్రామ పంచాయతీ, మండల అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో ప్రచురిస్తామని పేర్కొన్నారు. రాజకీయపార్టీల ప్రతినిధులు గ్రామస్థాయిలో నూతన ఓటరు జాబితా రూపకల్పనలో పలు సందేహాలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అందుకు కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి రామ్మోహన్‌రావు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మాజీ మంత్రికి పలువురి పరామర్శ

మాజీ మంత్రిని పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తిమ్మాజిపేట/కల్వకుర్తి/ఊర్కొండ, సెప్టెంబర్ 18 : భార్యను కోల్పోయిన మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డిని ఆయన కుటుంబ సభ్యులను బుధవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి ధర్మరాజు పరామర్శించారు. మండలంలోని ఆయన స్వగ్రామమైన ఆవంచలోని ఆయన ఇంటికి చేరుకొని శ్వేతారెడ్డి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మారెడ్డిని పరామర్శించారు. అదేవిధంగా మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డిని తిమ్మాజిపేట మండలం ఆవంచలో బుధవారం కల్వకుర్తి బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. డాక్టర్ శ్వేత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కల్వకుర్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సింగం విజయ్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకుడు గిరినాయక్ మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని పరామర్శించారు. తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామంలో ఆయన ఇంటికి చేరుకొని శ్వేతారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో కంబాల శ్రీనివాస్‌రెడ్డి, పరశురాములు, వెంకటస్వామి, నాయకులు ఉన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 18 : జిల్లాలో 2024-25 సంవత్సరానికి గానూ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఏఎన్‌ఎం పోస్టులకు అర్హులైన గిరిజన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 9 ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఇంటర్ ఉత్తీర్ణులై, ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో 18 నెలలు ఏఎన్‌ఎం శిక్షణలో ఉత్తీర్ణులై ఉండాలని లేదా దానికి సమానమైన అర్హత కలిగి ఉండాలన్నారు. గిరిజన సంక్షేమ విద్యా సంస్థల్లో పనిచేసిన అనుభవం కలిగిన వారికి 20 శాతం వెయిటేజీ (ఒక సంవత్సరానికి గానూ 5 శాతం చొప్పున గరిష్ఠంగా నాలుగు సంవత్సరాలకు వెయిటేజీ) ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. అర్హత పరీక్షల్లో మెరిట్ మార్కులు, గిరిజన సంక్షేమ విద్యా సంస్థల్లో పనిచేసిన అనుభవానికి వెయిటేజీ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. నెలసరి జీతం రూ.22,750 ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా ఇస్తామన్నారు. బాణాల, వటువర్లపల్లి, అప్పాయిపల్లి, ఉడిమిల్ల ఆశ్రమ పాఠశాలల్లో ఒక్కొక్కటి చొప్పున, పోస్ట్ మెట్రిక్ కాలేజీ హాస్టల్ కల్వకుర్తి, వెల్దండలోని బాలికల పాఠశాలలు, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తిలోని బాలుర పాఠశాలలో ఒక్కో ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఈనెల 23వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నాగర్‌కర్నూల్‌లోని కార్యాలయాల సముదాయంలోగల రూమ్‌నెంబర్ ఎఫ్27లోని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

విద్యార్థులపై భౌతికదాడి చేస్తే గుర్తింపు రద్దు చేస్తాం

- ప్రైవేట్ పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి
- విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు
- డీఈవో గోవిందరాజులు

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో గోవిందరాజులు

బిజినేపల్లి, సెప్టెంబర్ 18 : ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులను భౌతికంగా దండిస్తూ, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తే పాఠశాలల గుర్తింపును రద్దు చేస్తామని నాగర్‌కర్నూల్ డీఈవో గోవిందరాజులు హెచ్చరించారు. బిజినేపల్లిలోని మేధాన్స్ ప్రైవేట్ పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిపై పాఠశాల ప్రిన్సిపాల్ రమేశ్ భౌతికంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచి, విద్యార్థి మానసిక క్షోభకు గురిచేసిన ఘటనపై పాఠశాల ఉపాధ్యాయులు, యాజమాన్యంపై డీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలని సూచించారు. విద్యార్థులతో డీఈవో మాట్లాడి పాఠశాలలో ఉన్న సమస్యలు, ఉపాధ్యాయుల బోధన, ఉపాధ్యాయులు మీపై ఏమైనా భౌతికంగా దాడి చేస్తున్నారా.. అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌జేడీకి నివేదించి పాఠశాలపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఏ ఒక్క ఉపాధ్యాయుడు పాఠశాల తరగతి గదిలో బెత్తం పట్టడానికి వీలులేదని, విద్యార్థులపై భౌతికంగా దాడులు చేయకూడదని తెలిపారు. విద్యార్థులు ఫీజులు కట్టడం లేదని, పరీక్షల సమయంలో హాల్ టికెట్లను ఇవ్వకుండా మానసిక ఇబ్బందులకు గురిచేయకూడదని, ప్రతి మూడు మాసాలకు ఒకసారి ఫీజులు చెల్లించే వెసులుబాటు విద్యార్థుల తల్లిదండ్రులకు ఉంటుందని తెలిపారు. పాఠశాలల్లో బోధించే ప్రతి ఉపాధ్యాయుడికి తప్పనిసరిగా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఉండాలని, టెట్ లేకుంటే ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాబోధనకు అనర్హులని, అట్టివారితో బోధనలు కొనసాగించరాదని ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా మెరుగైన వసతులను అందించాలని, ప్రైవేట్ పాఠశాలలు కచ్చితమైన నిబంధనలు పాటించాలని సూచించారు. నియమ నిబంధనలకు లోబడి ఫీజులు ఉండాలని, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు విద్యార్థులు చెల్లించిన ఫీజుల నుంచి 15 శాతం పాఠశాల మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేయాలని, పాఠశాలకు ప్రహరీని నిర్మించాలని యాజమాన్యాన్ని డీఈవో ఆదేశించారు.

సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

చారకొండ, సెప్టెంబర్ 18 : మండలంలోని జేపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆ గ్రామానికి చెందిన యువకులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెమలిగుట్టతండా నుంచి జూపల్లి వరకు బీటీ రోడ్డుకు కంకర వేసి మధ్యలోనే రోడ్డు పనులు నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పవన్‌నాయక్, కిషన్‌నాయక్, రాజునాయక్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈవో

చారకొండ, సెప్టెంబర్ 18 : విద్యార్థులు విద్యతోపాటు క్రీడా రంగంలోనూ రాణించాలని ఎంఈవో శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ అండర్ 14-17 మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవో శంకర్‌నాయక్, ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్, మాజీ జెడ్పీటీసీ వెంకట్‌గౌడ్ ప్రారంభించారు. మండల స్థాయిలో సత్తా చాటిన జట్టులకు డివిజన్ స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని జీహెచ్‌ఎం భగవాన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తాసీల్దార్లు

బాధ్యతలు స్వీకరించిన ఉప్పునుంతల, చారకొండ తాసీల్దార్లు ప్రమీల, సునీత

ఉప్పునుంతల, సెప్టెంబర్ 18 : ఉప్పునుంతల నూతన తాసీల్దార్‌గా ప్ర మీల బుధవారం బాధ్యతలను స్వీకరించా రు. గతంలో ఉప్పునుంతల తాసీల్దార్‌గా పనిచేసిన సునీత చారకొండ తాసీల్దార్‌గా బదిలీ పై వెళ్లగా ఆమె స్థానంలో చారకొండ తాసీల్దార్‌గా పనిచేసిన ప్రమీల ఉప్పునుంతలకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమెను సిబ్బంది సన్మానించారు.

వెల్దండ మండలంలో..

వెల్దండ, సెప్టెంబర్ 18 : మండల నూతన తాసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కార్తీక్‌కుమార్‌ను బుధవారం పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో ఆయనకు పూలమాల శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మండల లో తిమ్మినోనిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రాజు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పలువురు డీలర్లు ఉన్నారు.

చారకొండ మండలంలో..

చారకొండ, సెప్టెంబర్ 18: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తాసీల్దార్‌గా సునీత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన తాసీల్దార్ కేసీ ప్రమీల ఉప్పునుంతలకు బదిలీపై వెళ్లడంతో ఉప్పునుంతలలో పని చేసిన సు నీత బదిలీపై చారకొండ మండలానికి వచ్చా రు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ మండలంలో భూ సమస్యలు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తానని చెప్పారు. నిరంతరం ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉంటానని ఆమె పేర్కొన్నారు.

ఎరుకలు ఆర్థికంగా ఎదగాలి

శిక్షణా కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాజు

లింగాల, సెప్టెంబర్ 18 : ఎరుకల కులస్తులు వెదురు హస్తకళా నైపుణ్యాలతో ఆర్థికంగా ఎదగాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు అన్నారు. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలో మాతృభూమి రూరల్ అభివృద్ధి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎరుకల మహిళలకు నిర్వహిస్తున్న శిక్షణా కేంద్రాన్ని సందర్శించి వెదురుతో తయారు చేస్తున్న వివిధ డిజైనింగ్ ఆకృతులను పరిశీలించి వాటి ప్రయోజనాలు, సంరక్షణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక, ఆర్థిక, పర్యావరణ ప్రాముఖ్యత కలిగి బహుముఖ ప్రయోజనాలు ఉన్న వెదురు సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. మండలంలో ఎరుకల కులస్తులకు హస్తకళ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో హస్తకళ డిజైనర్ మోహన్, సంస్థ డైరెక్టర్ రమాకాంత్ పాల్గొన్నారు.

విరాళం అందజేత

అమ్రాబాద్, సెప్టెంబర్ 18 : మండలంలోని మన్ననూర్‌లో గల వేణుగోపాలస్వామి ఆలయ గర్భగుడికి జాలి తలుపులు చేయించేందుకు బుధవారం దాతలు విరాళాన్ని అందజేశారు. ఆలయంలోకి కోతులు ప్రవేశించి నైవేద్యాన్ని పూజ సామగ్రిని గందరగోళం చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న అచ్చంపేట పట్టణానికి చెందిన టీజీ వెంకటేశ్వరశర్మ రూ.12,500, మల్‌రెడ్డి గోపాల్‌రెడ్డి రూ.10వేలను విరాళంగా అందజేశారని ఆలయ అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో వెంకటరమణ, శోభ, తిరుమల, జయమ్మ, శ్రీనివాసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను త్వరగా పూర్తి చేయాలి

బీఎల్‌వోలకు కిట్లను అందజేస్తున్న తాసీల్దార్ రామకృష్ణయ్య

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 18 : బీఎల్‌వోలు తమ పరిధిలో ఇంటింటి సర్వేను త్వరగా పూర్తి చేయాలని తాసీల్దార్ రామకృష్ణయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశమై మాట్లాడారు. మండలంలో ఇప్పటి వరకు 91 శాతం సర్వే పూర్తి అయ్యిందని, ఇందులో చనిపోయిన, శాశ్వత వలసలు వెళ్లిన వారిని తొలగించాలని, దివ్యాంగుల శాతం ఖరారు చేయాలన్నారు. త్వరలో సర్వే పూర్తి చేసి, నివేదిక ఇవ్వాలని సూచించి కిట్లను అందించారు. సమావేశంలో డీటీ జ్యోతి, ఆర్‌ఐ రవి, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

వెల్దండ, సెప్టెంబర్ 18 : మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన బూత్కురి కృష్ణయ్య(48) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. బుధవారం విషయం తెలుసుకున్న కొట్ర గ్రామ సేవా సమితి అధ్యక్షుడు రవీందర్‌రావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని మృతుడి భార్య ఎల్లమ్మకు అందజేశారు. అదేవిధంగా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు పాల చంద్రశేఖర్ రూ.3వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకుడు శ్రీనుయాదవ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఉప్పునుంతలలో..

ఉప్పునుంతల, సెప్టెంబర్ 18 : మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన బాలకృష్ణ(70) మంగళవారం రాత్రి మృతి చెందాడు. బుధవారం విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అనంతారెడ్డి స్థానిక నాయకులతో కలిసి మృతుడి కుటుంబాన్ని పరామర్శించాడు. అనంతరం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు బాలలక్ష్మయ్య, మల్లయ్య, శేఖర్, జంగయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

3వ వార్డు సమస్యలను పరిష్కరిస్తా

- మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు

కాలనీవాసులతో సమస్యలను తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్

అచ్చంపేటటౌన్, సెప్టెంబర్ 18 : పట్టణంలోని 3వ వార్డులో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో ప్రధాన రహదారి మీదుగా నీటి ప్రవాహం ఉండడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతున్నది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ అక్కడికి చేరుకొని వెంటనే సిబ్బంది సహకారంతో రోడ్డుకు మధ్యలో పెద్ద పైపును ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీవాసులతో మాట్లాడుతూ ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వెంటనే చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు రఘురాం, కపిలవాయి శేఖర్, నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండలాధ్యక్షుడి ఎన్నిక

ఉప్పునుంతల, సెప్టెంబర్ 18 : మండలం కేంద్రంలో బుధవారం పీఆర్టీయూ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం పెద్దల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అమీర్‌పాషా, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా రాంచంద్రారెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా అనిత, కార్యదర్శులుగా గోపి, జంగయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, నాయకులు బిచ్చానాయక్, శ్యాంసుందర్‌గౌడ్, పురుషోత్తం, శ్రీను, అజ్మతుల్లా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల పరిశీలన

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న శ్రీనివాసులు

లింగాల, సెప్టెంబర్ 18 : మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను బుధవారం జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఏఈఈ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారికి ఇరువైపులా ఓపెన్ డ్రైనేజీ ఉన్నప్పటికీ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రమాదాలను అరికట్టేందుకు పంచాయతీరాజ్ శాఖ కోఆప్షన్ సభ్యుల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను చేపట్టినట్లు తెలిపారు. రూ.2లక్షలతో దాదాపు 65మీటర్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఎంపీవో చంద్రశేఖర్, మాజీ కోఆప్షన్ సభ్యులు షఫీ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు కృషి చేద్దాం

మానవహారం నిర్వహించిన విద్యార్థులు

లింగాల, సెప్టెంబర్ 18 : పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో ఆంజనేయులు అన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అవుసలికుంట ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులచే మానవహారం నిర్వహించారు. అనంతరం వ్యాసరచన పోటీలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం

- సీఐ శంకర్‌నాయక్

మొక్కలను నాటుతున్న సీఐ శంకర్‌నాయక్

అమ్రాబాద్, సెప్టెంబర్ 18 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని అమ్రాబాద్ సీఐ శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం స్వచ్ఛతాహీ కార్యక్రమంలో పరిసరా పరిశుభ్రతలో భాగంగా మండలకేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన సొంత ఖర్చులతో వివిధ రకాల మొక్కలను తీసుకువచ్చి స్టేషన్ ఆవరణలో పదర మండలంలోని వంకేశ్వరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జక్కాపాండుతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331771-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

వైద్యాధికారి శివశంకర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్మికులు

లింగాల, సెప్టెంబర్ 18 : స్థానిక సీహెచ్‌సీ దవాఖానలో పారిశుధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ కార్మికులుగా విధులు నిర్వర్తిస్తున్న వారికి వెంటనే వేతనాలను చెల్లించాలని బుధవారం వైద్యాధికారి శివశంకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో జిల్లా, ఏరియా, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్నప్పటికీ 6నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. వేతనాలు చెల్లించకపోవడంతో తమ కుటుంబాలు పస్తులు ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 19వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నట్లు తెలుపుతూ.. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చిన్నపాగ శ్రీనివాసులు, సత్యం, దవాఖన కార్మికులు మల్లమ్మ, నిర్మల, బీమసేన, సూపర్‌వైజర్ బాలరాజు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ ఆత్మహత్య

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 18 : కల్వకుర్తి పట్టణంలోని రాధాకృష్ణ కాలనీ సీవీరామన్ స్కూల్ సమీపంలో ఇంట్లో ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు తాడూర్ మండలం సిర్సవాడ గ్రామానికి చెంది న జలాల్(50) కల్వకుర్తిలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో తలుపులు వేసుకొని ఉరేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవరెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బిజినేపల్లి, సెప్టెంబర్ 18 : మండలంలోని మంగనూర్ గ్రామ సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. వనపర్తి జిల్లా ఘణపురం మండలం మామిడిమాడ గ్రామం నుంచి బిజినేపల్లి మండలం మంగనూర్ గ్రామానికి ఇసుక తరలిస్తుండగా మంగళవారం రాత్రి విశ్వసనీయ సమాచారం మేరకు పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్, ఓనర్ గోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్

ప్రతి చిన్నారికీ టీకా వేయాలి

వంగూరు, సెప్టెంబర్ 18 : ప్రతి చిన్నారికీ వ్యాధి నిరోధక టీకాలను విధిగా వేయాలని జిల్లా టీకాల అధికారి రవికుమార్ నాయక్ వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని కొండారెడ్డిపల్లిలో బుధవారం సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శ్రీనివాస్, మహిళ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రవికుమార్‌నాయక్